సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 20 । మార్చి । 2025




టన్ను చీనీ రూ.27 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.27 వేలు, కనిష్టంగా రూ.3 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.8

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.8, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.7 ప్రకారం ధర పలికింది.



న్యూస్‌రీల్

ఖైదీలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



ఖైదీలకు న్యాయ సలహాలు ఇస్తున్న కార్యదర్శి

కదిరి టౌన్: సబ్ జైలులోని ఖైదీలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ జైలు సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక సబ్ జైలును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులో ఖైదీలకు కల్పించిన సౌకర్యాలు పరిశీలించారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఖైదీలకు న్యాయ సాయం అందించాలని సూచించారు. అనంతరం ఖైదీలతో సమావేశమయ్యారు. జైలు జీవితం గడిపి బయటకు వెళ్లిన వారు శాంతియుత జీవనం సాగించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు నరసింహులు, రఘునాథ్, ప్రభాకర్, నరేష్, జైలు సూపరింటెండెంట్ వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బలో ఆక్రమణల తొలగింపు



జేసీబీలతో ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

ముదిగుబ్బ: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) పరిధిలోని స్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను బుధవారం జేసీబీ యంత్రాలతో తొలగించారు. పీఏసీఎస్ స్పెషల్ ఆఫీసర్, సబ్ డివిజన్ అధికారి వన్నూరుస్వామి, సీఈఓ శ్రీనివాసులు దగ్గరుండి ఆక్రమణలు తొలగించారు. పీఏసీఎస్ పరిధిలో అక్రమ నిర్మాణాలను చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఉపాధ్యాయుడి ఔదార్యం

- విద్యార్థులకు సొంత ఖర్చుతో అల్పాహారం



విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి, ఉపాధ్యాయుడు నాగరాజు

ఓడీచెరువు: ఒంటిపూట బడులు ప్రారంభమైన నేపథ్యంలో ఖాళీ కడుపుతోనే ఉదయమే పాఠశాలకు వస్తున్న విద్యార్థుల ఆకలి బాధలను డబురువారిపల్లి ఉపాధ్యాయుడు కె.నాగరాజు గుర్తించారు. పాఠశాలలోని 40 మంది పిల్లలు ఇబ్బందులు పడకుండా తన సొంతఖర్చులతో ఒంటిపూట బడులు ముగిసే వరకూ అల్పాహారం అందించేందుకు ముందుకొచ్చారు. ఈ క్రమంలో బుధవారం ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి చేతుల మీదుగా అల్పాహార కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

కదిరి అర్బన్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని ఆర్జేడీ శామ్యూల్ బుధవారం తనిఖీ చేశారు. అలాగే బాలుర హైస్కూల్ సెంటర్‌ను డీఈఓ కృష్ణప్ప తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు ఆరా తీశారు.

పిల్లలు వడదెబ్బ బారిన పడకుండా చూడండి



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: విద్యార్థులు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తగా చూసుకోవాలని ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ నివేదిత పేర్కొన్నారు. బుధవారం ఆమె పుట్టపర్తి మండలంలోని ఎనుములపల్లి అంగన్‌వాడీ కేంద్రం, ప్రశాంతిగ్రామం పాఠశాల, జగరాజుపల్లి మోడల్‌స్కూల్, మంగళకర పాఠశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో రికార్డులు తనిఖీ చేశారు. చిన్నారులు ఎండలో తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పిల్లల్లో రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ మునిచంద్రిక, సీహెచ్‌ఓ నగేష్, సూపర్‌వైజర్ చంద్రకళ తదితరులు ఉన్నారు.

రారండోయ్ వేడుక చూద్దాం

- నేడు ఖాద్రీ లక్ష్మీ నారసింహుడి బ్రహ్మ రథోత్సవం
- దేశంలోనే మూడవది, తెలుగు రాష్ట్రాల్లో పెద్ద రథం
- లక్షలాది మంది భక్తులు పాల్గొంటారని అంచనా

అర్చకుల వేదమంత్రాలు.. లక్షలాది మంది భక్తుల జయజయ ధ్వానాలు... బ్రహ్మదేవుడే సారథిగా మారి రథాన్ని నడిపే తీరు... ప్రహ్లాద సమేత కాటమరాయుడి వైభవం కనిన భాగ్యము. ఈ అపురూప ఘట్టానికి అంతా సిద్ధమైంది. కదిరిలో ఆధ్యాత్మిక భక్తజన తరంగం పోటెత్తుతోంది. బ్రహ్మాండనాయకుడైన ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మరథోత్సవానికి సర్వం సిద్ధమైంది.



సిద్ధమైన శ్రీవారి బ్రహ్మ రథం



తెడ్లకు పూజలు చేస్తున్న కరణం కుటుంబ సభ్యులు

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నారసింహుని బ్రహ్మ రథోత్సవానికి సర్వం సిద్ధమైంది. గురువారం ఉదయం 7.45 నుంచి 8.20 గంటల మధ్య అనూరాధా నక్షత్రంలో మేష లగ్న పుష్కరాంశంలో తేరును ప్రారంభించేందుకు ఆలయ అర్చక పండితులు శుభ ముహూర్తంగా నిర్ణయించారు. బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాధాన్యత కలిగిన ఉత్సవం ఇది. తేరుపై కాటమరాయుడి వైభవాన్ని కనులారా చూసేందుకు భక్తులు లక్షలాదిగా ఇప్పటికే కదిరికి చేరుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణంతో పాటు తిరు వీధుల్లోని భవనాలన్నీ భక్తులతో కిటకిటలాడి పోతున్నాయి. ఆలయ ప్రాంగణంలో కాలు మోపేందుకు చోటు లేదు.

బ్రహ్మదేవుడే రథసారథి..

బ్రహ్మోత్సవాల్లో నారసింహుడు తిరు వీధుల్లో విహరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించడానికి దేవతలు తమ తమ వాహనాలను పంపుతారని భక్తుల నమ్మకం. శ్రీవారి రథోత్సవం నాడు సాక్షాత్తు బ్రహ్మదేవుడే రథాన్ని నడిపి స్వామి వారు విహరించడానికి సహకరిస్తారని, అందుకే బ్రహ్మ రథోత్సవం అంటారని ఆలయ ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు తెలిపారు.

దేశంలోనే మూడవ పెద్ద తేరు..

తమిళనాడు అండాల్ అమ్మవారి శ్రీవల్లి పుత్తూరు రథం, తంజావూర్ జిల్లాలోని తిరువార్ రథం తర్వాత దేశంలో అతి పెద్ద రథంగా కదిరి తేరు ప్రసిద్ధి చెందింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే అతిపెద్ద బ్రహ్మ రథం ఇదే. ఈ రథం సుమారు 540 టన్నుల బరువు, 37.5 అడుగుల ఎత్తు ఉంటుంది. రథంలోని పీఠం వెడల్పు 16 అడుగులు. 125 ఏళ్ల క్రితం తయారు చేసిన రథం చక్రాలు ఒక అడుగు, ఒక అంగుళం వెడల్పుతో పాటు 8 అడుగుల డయామీటర్‌తో ఉన్నాయి. రథంపై సుమారు 256 శిల్ప కళాకృతులను టేకుతో అందంగా చెక్కారు. వివిధ భంగిమల్లో చెక్కిన ఈ బొమ్మలు అప్పటి శిల్ప కళా నైపుణ్యానికి నిదర్శనం. రథ చక్రాలకు గత ప్రభుత్వ హయాంలో మరమ్మతులు చేశారు. 3 లక్షల మందికి పైగా భక్తులు ఖాద్రీశుని రథోత్సవంలో పాల్గొంటారని పోలీస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. భక్తుల కోసం పట్టణంలో అడుగడుగునా అన్నదాన కార్యక్రమాల ఏర్పాటుకు దాతలు ముందుకొచ్చారు.

700 మంది పోలీసులతో భారీ బందోబస్తు..

ఖాద్రీశుడి బ్రహ్మ రథోత్సవానికి భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వి.రత్న మీడియాకు వివరించారు. మొత్తం 700 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నట్లు ఆమె వెల్లడించారు. అందులో ఆరుగురు డీఎస్పీలు, 20 మంది సీఐలు, 40 మంది ఎస్‌ఐలు, 500 మంది సివిల్ పోలీసులు, 100 స్పెషల్ పార్టీ, ఏఆర్ పోలీసులు, 90 మంది ఏపీఎస్పీ పోలీసులు ఉన్నట్లు ఆమె వెల్లడించారు. రథోత్సవం ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు. అలాగే రథోత్సవం సమయంలోనూ 60 మంది పోలీసులు మఫ్టీలో విధులు నిర్వర్తిస్తూ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకుంటారన్నారు. స్వామి దర్శనానికి వచ్చే మహిళలు, చిన్నారులకు ఇబ్బందులు కలగకుండా 100 మంది మహిళా పోలీసులను నియమించామన్నారు. ఇక మాడవీధులు, కదిరిలోని రద్దీ ప్రాంతాల్లో నిఘా కోసం 10 డ్రోన్ కెమెరాలతో పాటు 50 అత్యాధునిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు.

తేరు మొద్దులకు పూజలు..

కదిరి టౌన్: ఖాద్రీశుని బ్రహ్మరథోత్సవంలో తేరు గమనాన్ని నియంత్రించడానికి వాడే సన్న మొద్దులకు బుధవారం పూజలు నిర్వహించారు. ఆనవాయితీగా కుటాగుళ్ల కరణం వారసులైన రాయసం హరిప్రసాద్ ఇంటి వద్ద అర్చకులతో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కరణం కుటుంబ సభ్యులైన నాగభూషణం శాస్త్రి, సునీల్ శాస్త్రి, శంకర, నీరుగుట్టు చెన్నప్ప, నరేష్, కుళ్లాయప్ప, శ్రీరాములు, గంగన్న తదితరులు తెడ్లను తయారు చేశారు. వాటికి పూజలు నిర్వహించిన అనంతరం తేరు వద్దకు తరలించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

● ఐరావతంపై వసంత వల్లభుడు



ఐరావతంపై నృసింహుడి దర్శనం

కదిరి: వసంత వల్లభుడిగా పేరు గాంచిన ఖాద్రీ లక్ష్మీ నారసింహుడు బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ఐరావతం (గజవాహనం)పై దర్శనమిచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగున్న కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ఐరావతంపై కాటమరాయుడి కమనీయ రూపాన్ని చూసి తరించారు. అనంతరం శ్రీవారు తిరిగి ఆలయంలోకి వెళ్లి పూజలందుకున్నారు. గురువారం తెల్లవారుజామున శ్రీవారు రథంపైకి ప్రవేశించనున్నారు. శ్రీదేవి, భూదేవిలను కంకణ భట్టాచార్యులు రథంపైకి తీసుకురానున్నారు. అంతకుముందు అర్చకులు యాగశాలలో నిత్య హోమాలు నిర్వహించి రథ కలశ పూజలు చేశారు. ఆ తర్వాత దాన్ని శ్రీవారి బ్రహ్మ రథంపై ప్రతిష్ఠించారు. శ్రీవారికి నిత్య కైంకర్య సేవలు నిర్వహించిన మీదట బ్రహ్మరథం వద్ద శుద్ధి పుణ్యహవచనం, వాస్తు హోమాలు, రథాంగ హోమాలు, రథ సంప్రోక్షణ చేశారు. ఆలయంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరిస్తున్నాయి.

ఐసీడీఎస్.. అస్తవ్యస్తం

- నెలల వ్యవధిలోనే మారిపోతోన్న పీడీలు
- కూటమి నేతల ఒత్తిళ్లతో దందా చేయడం.. వెళ్లిపోవడం
- అంగన్‌వాడీల నియామకాలు, బదిలీల్లో భారీగా చేతివాటం
- కొనసాగితే ఇబ్బందులు తప్పవని తెలిసి తప్పిస్తున్న నాయకులు

సాక్షి, పుట్టపర్తి



ఐసీడీఎస్ కార్యాలయం

ఆరేళ్లలోపు చిన్నారులు, బాలింతలు, గర్భిణుల సంక్షేమం కోసం సర్కారు ఏర్పాటు చేసిన ఐసీడీఎస్ (ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్) విభాగంలో పాలన అస్తవ్యస్తంగా మారింది. కూటమి సర్కారు అధికారం చేపట్టిన తర్వాత ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అధికార పార్టీ నాయకుల మాట వినకుంటే బదిలీ బహుమానంగా ఇస్తున్నారు. చిన్నారులకు గుడ్లు, పండ్లు, కూరగాయలు పంపిణీ చేసే కాంట్రాక్టర్ల నుంచి అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల నియామకాల వరకు కూటమి నేతలదే పెత్తనం. కూటమి నేతల సూచన మేరకు పని చేస్తేనే కొనసాగే పరిస్థితి కనిపిస్తోంది. ఒక వేళ వారు చెప్పినట్లు తల ఆడించినా...ఉన్నతాధికారుల నుంచి వేటు తప్పదు. ఈక్రమంలో జిల్లా ఐసీడీఎస్ పీడీగా రావాలంటే అధికారులు జంకుతున్నారు. గడిచిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నూతనంగా జిల్లా ఏర్పడిన నాటి నుంచి కూటమి ప్రభుత్వం వచ్చే వరకు ఒకరే పీడీగా ఉన్నారు. అప్పట్లో ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేసేవారు. కేవలం అర్హత ఆధారంగా నియామకాలు చేపట్టేవారు. ఫలితంగా ఎవరికీ ఇబ్బంది ఉండేది కాదు. కానీ ప్రస్తుతం పరిస్థితి మారిపోయింది. దీంతో ఉండలేక చాలామంది పీడీలు స్వచ్ఛందంగా తమ స్థానాలకు వెళ్లిపోతున్నారు.

ఆ ఒక్క పదవీ విరమణతో..

జిల్లా ఏర్పాటు నాటి నుంచి ఐసీడీఎస్ పీడీగా ఉన్న లక్ష్మీకుమారి గతేడాది జూలై 31వ తేదీన పదవీ విరమణ పొందారు. ఆ తర్వాత మడకశిర సీడీపీఓగా ఉన్న నాగమల్లీశ్వరి ఇన్‌చార్జ్ పీడీగా వచ్చారు. సుమారు రెండున్నర నెలల పాటు ఆమె విధులు నిర్వర్తించారు. ఆ సమయంలో ఐసీడీఎస్‌లో పలు కాంట్రాక్ట్‌లకు టెండర్లు పిలిచారు. ఏం జరిగిందో తెలిసే లోపు.. ఆమె తిరిగి మడకశిర సీడీపీఓగా వెళ్లిపోయారు. ఆ తర్వాత ఇన్‌చార్జ్ పీడీగా ఓడీ చెరువు సీడీపీఓగా ఉన్న సుధావరలక్ష్మి బాధ్యతలు తీసుకున్నారు. ఆమె హయాంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల నియామకాలు జరిగాయి. ఆ తర్వాత ఉన్న ఫలంగా ఈనెల 17వ తేదీన కొత్త పీడీని నియమించారు. దీంతో ఆమె తిరిగి ఓడీ చెరువు సీడీపీఓగా వెళ్లిపోయారు.

డైరెక్టరేట్ నుంచి వచ్చిన పీడీ..

జిల్లా ఐసీడీఎస్‌లో చోటు చేసుకుంటున్న నాటకీయ పరిణామాల కారణంగా.. నేరుగా డైరెక్టరేట్ నుంచి నియామకాలు చేపట్టారు. ఈ క్రమంలోనే గుంటూరులో పని చేసే శ్రీదేవిని.. శ్రీసత్యసాయి జిల్లా ఐసీడీఎస్ పీడీగా నియమించారు. ఈనెల 17వ తేదీన ఆమె బాధ్యతలు స్వీకరించారు. అయితే ఆమె ముందు పలు సవాళ్లు ఉన్నాయి. అన్నీ చక్కబెడతారా? లేక సర్దుకుంటారా? అనేది చర్చనీయంగా మారింది.

నియామకాల్లో చేతివాటం!

అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల నియామకాల్లో కూటమి నేతల సూచన మేరకు ఉద్యోగాలు ఇచ్చినా.. కొందరు సిండికేటుగా మారి ఆయా గ్రామ స్థాయి నాయకులతో కుమ్మక్కై భారీగా చేతివాటం ప్రదర్శించినట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వానికి.. అధికారికి చెడ్డపేరు రాక ముందే మార్పులు చేస్తున్నారని సమాచారం. దందా చేయడం.. చేయించడం.. తర్వాత బదిలీపై వెళ్లిపోవడం.. ఇంకొకరు రావడం.. ఐసీడీఎస్‌లో ఆర్నెల్లుగా జరుగుతున్న తీరు ఇదే.

ఫిర్యాదు చేయండి



ఐసీడీఎస్‌లో ఎలాంటి అవినీతికి తావు లేదు. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే ఫిర్యాదు చేయండి. విచారణ చేయించి నేరం రుజువైతే చర్యలకు ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తాం. ఏ రాజకీయ పార్టీకి ప్రాధాన్యం ఉండదు. ప్రభుత్వ నిబంధనల మేరకు నియామకాలు, పాలన ఉంటుంది. – శ్రీదేవి, ఐసీడీఎస్ పీడీ, శ్రీసత్యసాయి జిల్లా

ఐచ్ఛికంతో 'తెలుగు' ప్రశ్నార్థకం



జూనియర్ కళాశాల ఎదుట నిరసన తెలుపుతున్న తెలుగు అధ్యాపకులు

పుట్టపర్తి టౌన్: ఇంటర్మీడియెట్‌లో తెలుగును ఐచ్ఛికం (ఆప్షనల్) చేస్తే తెలుగుభాష ఉనికి ప్రశ్నార్థకమవుతుందని తెలుగు అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటర్ మూల్యాంకనం కోసం వచ్చిన అధ్యాపకులు బుధవారం కొత్త చెరువు జూనియర్ కళాశాల ఎదుట నిరసనకు దిగారు. అనంతరం జిల్లా ఇంటర్ విద్య అధికారి రఘునాథరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంటర్మీడియెట్‌లో ద్వితీయ భాష తెలుగును ఐచ్ఛిక సబ్జెక్టుగా మార్చేందుకు చేస్తున్న ప్రయత్నాలు వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు నూరుల్లా, శంకరప్ప, పెద్దన్న, బయపరెడ్డి, నాగరత్నమ్మ, లలిత, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ, వైస్ ఎంపీపీ స్థానాలకు 27న ఎన్నికలు

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ కారణాలతో ఖాళీ ఏర్పడ్డ ఎంపీపీ, వైస్ ఎంపీపీ స్థానాలకు ఈ నెల 27న ఎన్నికలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఈఓ జి.వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ మేరకు బుధవారం రాత్రి రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి తమకు ఉత్తర్వులు వచ్చాయని వివరించారు. ఖాళీ అయిన రొద్దం, రామగిరి, గాండ్లపెంట, కంబదూరు, కణేకల్లు ఎంపీపీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఉరవకొండ, యల్లనూరు, పెద్దపప్పూరు, రాయదుర్గం వైస్ ఎంపీపీ స్థానాలకు అదే రోజు ఎన్నికలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య ప్రకటించారు. పైన పేర్కొన్న స్థానాల్లో కొందరు చనిపోగా, మరికొందరు తమ పదవులకు రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడిన స్థానాలకు ప్రస్తుతం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లలో అధికారులు తలమునకలయ్యారు.

హిందీ పరీక్షకు 141 మంది గైర్హాజరు

పుట్టపర్తి: పదో తరగతి వార్షిక పరీక్షల్లో భాగంగా బుధవారం నిర్వహించిన హిందీ పరీక్షకు 141 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి కృష్ణప్ప తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 104 పరీక్ష కేంద్రాల్లో 21,271 మంది విద్యార్థులు హిందీ పరీక్ష రాయాల్సి ఉండగా, 21,130 మంది మాత్రమే హాజరయ్యారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. డీఈఓతో పాటు జిల్లా విద్యాశాఖ అధికారులు పలు కేంద్రాలను తనిఖీ చేశారు.

EAMCET NEET JEE
APRJC RDT పాలిసెట్
హాస్టల్ కలదు Classes Starts : 21st March
SARADA ACADEMY 2వ క్రాస్, అశోక్‌నగర్, అనంతపురము
9866117303, 9908829351

SRI MASTERS ACADEMY CLASSES STARTS 24-03-2025
9440774498, 9440445898
45 DAILY TESTS & 8 GRAND TESTS
EAPCET NEET JEE (MAINS)
SEPARATE HOSTEL FOR BOYS & GIRLS
GIRLS CAMPUS Opp. RTA Office Bhairava Nagar, ATP
BOYS CAMPUS Intel Campus, Akkampalli Cross, KLD Road, ATP

EAPCET 2nd BATCH STARTS : 20th MARCH
NEET JEE-IIT
AC CAMPUS | ONLY GIRLS
GLOBAL SCHOOL COLLEGE Near SJR Function Hall Opp.TV Tower, ANANTAPUR
9247134363, 8555826272 హాస్టల్ కలదు

తహసీల్దార్లు స్థానికంగానే నివాసం ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్, చిత్రంలో జేసీ అభిషేక్‌కుమార్

ప్రశాంతి నిలయం: తహసీల్దార్లు మండల కేంద్రంలోనే నివాసం ఉంటూ ఎప్పటిపనులు అప్పుడే పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. రీసర్వేలో ప్రగతి సాధించేందుకు తహసీల్దార్లు, సర్వేయర్లు బాధ్యతతో పని చేయాలన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో రీసర్వే, పీజీఆర్‌ఎస్ తోపాటు రెవెన్యూ అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇంటి స్థలం సర్టిఫికెట్ మ్యానువల్‌గా ఇవ్వకూడదన్నారు. రీసర్వే సక్రమంగా జరిగితే భూ సమస్యలు తగ్గుతాయన్నారు. నిబంధనల మేరకు రీ సర్వే నిర్వహించాలని, ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్త పడాలన్నారు. పీజీఆర్‌ఎస్‌లో అందిన అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలన్నారు. భూముల హద్దులు నిర్ణయించేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఐవీఆర్‌ఎస్ రిపోర్టులో అమరాపురం, ఆగళి, చిలమత్తూరు, రొద్దం, రొళ్ల, సోమందేపల్లి సర్వేయర్లపై వచ్చిన ఆరోపణలపై సంబంధిత ఆర్డీఓలు క్షేత్రస్థాయిలో విచారించి నివేదికలు అందజేయాలన్నారు. అనంతరం జేసీ అభిషేక్ కుమార్ మాట్లాడుతూ, జిల్లాలో 25 గ్రామాలను పైలెట్‌గా ఎంపిక చేశామని, ఆయా గ్రామాల్లో మార్చి 20 నుంచి రీ సర్వే నిర్వహిస్తామన్నారు. ముందుగా ప్రతి రైతుకు, పట్టాదారునికి నోటీసులు జారీ చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీఓలు, సర్వే అండ్ ల్యాండ్ అధికారి, తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.



క్లుప్తంగా

ఆర్థిక ఇబ్బందులు తాళలేక మాజీ వలంటీర్ ఆత్మహత్య


మహేంద్ర (ఫైల్)

గుత్తి: తల్లి ఆపరేషన్ కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక గ్రామ సచివాలయ మాజీ వలంటీర్ ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం గోరిమానుపల్లి గ్రామానికి చెందిన శ్రీరాములు, మణెమ్మ దంపతుల కుమారుడు మహేంద్ర గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆ గ్రామ సచివాలయ వలంటీర్‌గా పనిచేశాడు. ఆ సమయంలోనే తన తల్లికి శస్త్రచికిత్స అవసరం కావడంతో రూ.3 లక్షల వరకు అప్పులు చేశాడు. ఈలోపు రాష్ట్రంలో అధికారం మారి కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. వలంటీర్ వ్యవస్థను సీఎం చంద్రబాబు రద్దు చేయడంతో అప్పు ఎలా తీర్చాలో తెలియక మదనపడ్డాడు. వడ్డీ వ్యాపారుల ఒత్తిళ్లు తీవ్రం కావడంతో యాడికి మండలం బోయరెడ్డిపల్లి వద్ద ఉన్న పెన్నా సిమెంట్స్ పరిశ్రమలో పనిలోకి చేరాడు. ఈ క్రమంలోనే తమ అప్పు తీర్చాలంటూ వడ్డీ వ్యాపారుల నుంచి వేధింపులు తీవ్రమయ్యాయి. దీంతో దిక్కుతోచని మహేంద్ర (26) నాలుగు రోజుల క్రితం ఫ్యాక్టరీకి వెళుతున్నానని ఇంట్లో చెప్పి వచ్చాడు. అప్పటి నుంచి తిరిగి ఇంటికి వెళ్లలేదు. బుధవారం ఉదయం గుత్తి రైల్వేస్టేషన్‌కు చేరుకున్న మహేంద్ర...జీఆర్పీ స్టేషన్ ఎదుట అందరూ చూస్తుండగా రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వద్ద లభ్యమైన ఆధారాలను బట్టి ఆచూకీని గుర్తించిన జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప సమాచారంతో మహేంద్ర తల్లిదండ్రులు గుత్తికి చేరుకున్నారు. కుమారుడి మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. ఆర్థిక సమస్యలతోనే తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నట్లుగా ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పాత బస్టాండ్ వద్ద వ్యక్తి మృతదేహం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రాయదుర్గం టౌన్: స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న అన్నా క్యాంటీన్ వెనుక గుర్తు తెలియని వ్యక్తి (55) మృతదేహాన్ని స్థానికులు బుధవారం ఉదయం గుర్తించారు. సమాచారం అందుకున్న సీఐ జయానాయక్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రిలోని మార్చురీ గదికి తరలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో సామాజిక మాధ్యమాల్లో ఫొటోలను వైరల్ చేశారు. ఆచూకీ తెలిసిన వారు రాయదుర్గం పోలీసులను సంప్రదించాలని సీఐ కోరారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. కాగా, రెండు రోజులుగా సదరు వ్యక్తి ఆ ప్రాంతంలో సంచరిస్తున్నట్లుగా స్థానికుల ద్వారా తెలిసింది. అతిగా మద్యం సేవించడంతో పాటు వడదెబ్బకు గురై మృతి చెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి.

నేత్రపర్వం.. భూతప్పల ఉత్సవం


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి మూల విరాట్


భక్తులపై కాలు మోపుతున్న భూతప్పలు


ఉత్సవానికి హాజరైన అశేష జనం

- భూతప్పల కాలిస్పర్శ కోసం పోటెత్తిన భక్తులు

రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం భూతప్ప ఉత్సవం నేత్రపర్వంగా సాగింది. ఉత్సవానికి ఉమ్మడి అనంతపురం జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడులోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు మంగళవారం సాయంత్రమే తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. స్వామి మూల విరాట్‌కు బుధవారం తెల్లవారుజామున అభిషేకం, అంకురార్పణ, కుంకుమార్చన, తులసీపూజ చేశారు. అనంతరం వెండి, బంగారు ఆభరణాలతో పాటు పంచ లోహ కవచాలతో అలంకరణ చేశారు. దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వారు, సంతానం లేని మహిళలు, పెళ్లిళ్లు కాని యువతులు, ఇతర కుటుంబసమస్యలతో ఇబ్బంది పడుతున్న వారు వేకువజామునే చన్నీటి స్నానంచేసి తడి దుస్తులతోనే స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఈరముద్దమ్మదేవి ఆలయం నుంచి ప్రధాన ఆలయం వరకూ దాదాపు కిలోమీటర్ల మేర భక్తులు భూతప్పల పాద స్పర్శ కోసం బోర్ల పడుకున్నారు. మారుతీ కాలనీ సమీపంలోని ముత్తరాయస్వామి ఆలయంలో విశేష పూజల అనంతరం మేళతాళాలతో పాదాల బండ వద్ద నుంచి బయలుదేరిన భూతప్పలు నృత్యం చేస్తూ భక్తుల మీదుగా ప్రధాన ఆలయానికి చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ప్రధాన ఆలయంతో పాటు సమీపాన ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలోనూ పూజలు చేశారు. తమ మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు సమర్పించిన బొరుగులను ఆంజనేయస్వామి ఆలయంలో రాసిగా పోసి, దాని చుట్టూ ఉరాల శబ్దాల నడుమ భూతప్పలు నాట్యం చేస్తూ బొరుగులను ఆరగించారు. అనంతరం బొరుగులను భక్తులకు ప్రసాదంగా పంచారు. ఉత్సవానికి తరలి వచ్చిన భక్తుల సౌకర్యార్థం 8 ప్రాంతాల్లో అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం 4.30 గంటలకు లక్ష్మీనరసింహస్వామి ఆలయం సమీపంలో వెలసిన భూతప్ప ఆలయం వద్దకు చేరుకుని పట్టం కూర్చొబెట్టారు. ఉత్సవాల్లో ఎలాంటి అల్లర్లు చోటు చేసుకోకుండా ప్రొబేషనరీ డీఎస్పీ ఉదయ పావని నేతృత్వంలో మడకశిర సీఐ రాజ్‌కుమార్, ఎస్‌ఐలు వీరాంజినేయులు, ఇషాక్‌బాషా, సిబ్బంది గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు ప్రసాద వితరణ..

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం భూతప్పస్వామి ఆలయం ఆవరణలో భక్తులు సమర్పించిన వడి బియ్యం, బెల్లం తదితర వాటితో 101 వడలు చేసి నైవేద్యం సమర్పించనున్నారు. అనంతరం భక్తులకు ప్రసాద రూపంగా పంపిణీ చేయనున్నారు.

25న చలో కలెక్టరేట్


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్

పుట్టపర్తి టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25న చలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈఎస్ వెంకటేష్ అధ్యక్షతన పార్టీ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న రాంభూపాల్ మాట్లాడుతూ... జిల్లాలో అర్ధంతరంగా ఆగిపోయిన జగనన్న ఇళ్లు, టిడ్కో ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు పట్టణాల్లో రెండు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల చొప్పున స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలోనూ శ్మశానానికి భూమిని కేటాయించాలని, ఉపాధి బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. రైతులకు నష్టం కలిగించే హంద్రీనీవా లైనింగ్ పనులు వెంటనే నిలిపివేయాలన్నారు. కూటమి పార్టీల నేతల ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులు, నరసింహులు, జంగాలపల్లి పెద్దన్న, దిల్షాద్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఊర పిచ్చుక.. ఊరికే అందం

సందర్భం
నేడు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

ఒక ఊరిలో పిచ్చుక కనిపిస్తే ఆ ఊరు పచ్చగా ఉన్నట్లు గ్రామీణులు ఓ అంచనా వేస్తుంటారు. పిచ్చుకలు కనిపిస్తున్నాయంటే ఆ ఊరిలో నీటి వనరులు సమృద్ధిగా ఉన్నట్లు.. పంటలు బాగా పండుతున్నట్లు భావిస్తారు. పంట చేలల్లో రైతులను ఇబ్బంది పెట్టే క్రిమికీటకాలను తింటూ ఎంతో మేలు చేస్తాయి. ఇంట్లో క్రిమికీటకాలు కనిపించాయంటే గుటుక్కున మింగేసి వాటిబారి నుంచి మనల్ని కాపాడతాయి. జీవ వైవిధ్యానికి ప్రతీకగా ఉండే పిచ్చుకల సంఖ్య నేడు గణనీయంగా తగ్గింది. ఈ క్రమంలో పిచ్చుకల జాతి పరిరక్షణకు ప్రపంచ వ్యాప్తంగా 2010 నుంచి ఏటా మార్చి 20న 'ప్రపంచ పిచ్చుకల దినోత్సవం' నిర్వహిస్తూ వాటి మనుగడ ఆవశ్యకతపై ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నారు. ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'సాక్షి' ప్రత్యేక కథనం.





సోములదొడ్డి సమీపంలో పంట పొలాల వద్ద విద్యుత్ తీగలపై సేద తీరుతున్న ఊర పిచ్చుకలు, పిచ్చుకల సంరక్షణకు కృత్రిమ గూళ్లను అందిస్తున్న ఏజీ అనిల్‌కుమార్‌రెడ్డి

అనంతపురం కల్చరల్: ఒకప్పుడు ఊర పిచ్చుకలు లేని ఊరులేదంటే అతిశయోక్తి కాదు. గ్రామీణ ప్రాంతాల్లో ఏ వాడ చూసినా, ఏ ఇల్లు చూసినా గుంపులు గుంపులుగా ఊరపిచ్చుకలు కనిపించేవి. మిగతా పక్షులకు భిన్నంగా ఊర పిచ్చుకలు, మానవులు ఒకే కుటుంబసభ్యులుగా కలిసి పోయేవారు. గుప్పెడు గింజలు వేస్తే చాలు కలకాలం తోడుండే పిచ్చుకలు నేడు వాతావరణంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, రేడియేషన్, శబ్ద కాలుష్యాల దెబ్బకు ఎక్కడికక్కడ రాలిపోతున్నాయి. దీంతో పర్యావరణాన్ని కాపాడే పిచ్చుకల జాతి సంరక్షణకు ప్రత్యేకంగా నడుం బిగించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

అంతరించిపోతున్న సంప్రదాయం

ఇంట్లో పిచ్చుకలు గూడు కట్టుకుంటే శుభం జరుగుతుందని పూర్వీకులు భావించి, వాటిని ముద్దుగా పిలుస్తూ ధాన్యాలను వెదజల్లేవారు. ఇళ్లు, ప్రార్థనా మందిరాల్లో పావురాలు, పిచ్చుకలు యథేచ్ఛగా సంచరించేవి. ఇప్పుడవన్నీ భూతద్దం పెట్టి వెతికినా కానరావు. రోజురోజుకూ పెరిగిపోతున్న మానవుడి స్వార్థం కారణంగా పచ్చని చెట్లు, చల్లటి వాతావరణం కనుమరుగవుతోంది. జిల్లాలో పంటల సాగులో రసాయనిక మందుల వినియోగం పెరిగిపోవడం కూడా పక్షి జాతి అంతరించేందుకు కారణమవుతోంది. ముఖ్యంగా సెల్‌ఫోన్ల వాడకం పెరిగిపోయే కొద్దీ పిచ్చుకల జాతి క్రమంగా అంతరించిపోతూ వస్తోంది. నానాటికీ తగ్గుతున్న పర్యావరణ సమతుల్యత పక్షి జాతిని నేటి తరానికి దూరం చేస్తోంది. ఇలాంటి తరుణంలో పిచ్చుకల సంరక్షణకు మేము సైతం అంటూ పలువురు ముందుకొస్తున్నారు. కృత్రిమ గూళ్లను ఉచితంగా అందిస్తున్నారు. మలమల మాడ్చేస్తున్న వేసవి నుంచి కాపాడుకునేందుకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పలు చోట్ల నీటి తొట్టెలను ఏర్పాటు చేశారు.

ఊరంతా పిచ్చుక గూళ్లు

ఊర పిచ్చుకలకు మిగిలిన పక్షులకు చాలా తేడా ఉంటుంది. ఊర పిచ్చుకలు మనుషులతో సన్నిహితంగా మెలుగుతాయి. దీంతో ఒకప్పుడు ఊరంతా పిచ్చుక గూళ్లు కనిపించేవి. ఆహారం కోసం, నివాసం కోసం పూర్తిగా మానవులపై ఆధారపడతాయి. పొలాల్లో ఎగురుతూ పంట నష్టాలకు కారణమైన క్రిమికీటకాలను ఆరగిస్తాయి. పిచ్చుక చిన్నదే అయినా దాని ఉనికిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక జీవన విధానం పిచ్చుకల మనుగడకు ప్రతిబంధకం కారాదని పక్షి ప్రేమికులు అంటున్నారు. పిచ్చుకల సంరక్షణకు అనంతపురానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త ఏజీ అనిల్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇందులో భాగంగా 1.40 లక్షల కృత్రిమ గూళ్లను ఇంటింటికి అందించి, పిచ్చుకల పునరుత్పత్తికి దోహదపడేలా చర్యలు తీసుకున్నారు. పిచ్చుకల విషయంలో ఆయన తీసుకున్న శ్రద్ధ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డుల్లో అనంత ఖ్యాతిని పతాక స్థాయిలో మెరిసేలా చేసింది. పర్యావరణానికి దోహదపడే పిచ్చుకలను సంరక్షించుకోవడం అందరి బాధ్యత అని, ఆ దిశగా అందరూ ప్రయాణం సాగించాలని అనిల్‌కుమార్‌రెడ్డి పిలుపునిస్తున్నారు.

యువకుడి హత్య

- వివాహేతర సంబంధమే కారణమన్న పోలీసులు


హతుడు సద్దాం

హిందూపురం: మండలంలోని మలుగూరు చెరువు కట్ట సమీపంలో ఓ యువకుడిని దారుణంగా హతమార్చారు. వివాహేతర సంబంధమే ఇందుకు కారణంగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. సీఐ వేణుగోపాల్ తెలిపిన మేరకు... హిందూపురంలోని శాంతినగర్‌లో నివాముంటున్న షఫీకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ నేపథ్యంలో కొన్ని నెలల క్రితం తన భార్యను వదిలేసి మరో మహిళతో కలసి అనంతపురానికి మకాం మార్చిన షఫీ... అక్కడే ఆమెతో సహజీవనం సాగిస్తూ వచ్చాడు. ఈ క్రమంలో కుటుంబ పోషణ భారం కావడంతో షఫీ భార్య బతుకుతెరువు కోసం ఓ రీలర్ వద్ద రేషమ్ దారం తీసే కార్మికురాలిగా పనిలో చేరింది. పని ప్రాంతంలోనే ఆమెకు సద్దాం అనే యువకుడు పరిచయమయ్యాడు. సద్దాంకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్తకు దూరమై కుటుంబ పోషణ కోసం ఒంటరిగా శ్రమిస్తున్న షఫీ భార్యకు అన్ని విధాలుగా సద్దాం అండగా ఉంటూ వచ్చాడు. ఈ విషయం గమనించిన షఫీ బంధువులు వారి మధ్య అనైతిక సంబంధమున్న అపోహతో సమాచారం అందివ్వడంతో నెల రోజుల క్రితం షఫీ హిందూపురానికి చేరుకున్నాడు. భార్యను మందలించాడు. పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించాడు. ఆ సమయంలో పెద్దలు సర్దిచెప్పడంతో అప్పటికి సమస్య సద్దుమణిగింది.

పంచాయితీకి రమ్మంటూ..

మంగళవారం రాత్రి పరిశ్రమలో పని ముగించుకుని ఇంటికి బయలుదేరిన షఫీ భార్యకు తోడుగా సద్దాం కూడా నడిచాడు. ఇద్దరూ జిల్లాస్పత్రి సమీపంలో వెళుతుండగా గమనించిన షఫీ ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ గొడవపడ్డాడు. సద్దాం నచ్చచెప్పబోతుండగా అడ్డుకుని ఎలాంటి తప్పు చేయకపోతే ఇప్పటికిప్పుడు పెద్దల సమక్షంలో వచ్చి వారికి సమాధానమిచ్చుకోవాలని రెచ్చగొట్టాడు. ఇందుకు తాను సిద్ధంగా ఉన్నానని సద్దాం తెలపడంతో తన ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని వెళ్లాడు. అయితే భర్త ప్రవర్తనపై అనుమానం రావడంతో షఫీ భార్య వెంటనే విషయాన్ని పోలీసులకు ఫోన్ చేసి తెలిపింది. సద్దాం ఫోన్ నంబర్ ఆధారంగా పోలీసులు గాలిస్తూ రాత్రి 12 గంటల సమయంలో మగుగూరు సమీపంలోని చెరువు వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉన్న సద్దాంను గుర్తించి హత్యకు గురైనట్లుగా నిర్ధారించుకున్నారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. వేటకొడవళ్లతో దారుణంగా నరికి హతమార్చినట్లుగా పోలీసుల ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. ఈ దారుణానికి ఒడిగట్టిన షఫీకి మరో ఇద్దరు సహకరించినట్లుగా గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

69 మంది వీఎస్‌ఏలకు పదోన్నతి


- టెక్నికల్ అసిస్టెంట్లుగా అవకాశం

అనంతపురం అగ్రికల్చర్: పట్టు పరిశ్రమశాఖ పరిధిలోని విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్స్ (వీఎస్‌ఏ)కు పదోన్నతి దక్కింది. సచివాలయ వ్యవస్థలో భాగంగా గత ప్రభుత్వం ఉమ్మడి జిల్లా పరిధిలో 152 మంది వీఎస్‌ఏలను నియమించింది. ఇందులో సీనియార్టీ, ఇతర నిబంధనల మేరకు 69 మందికి టెక్నికల్ అసిస్టెంట్లు (టీఏలు)గా పదోన్నతి కల్పిస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రెండు జిల్లాల పట్టుపరిశ్రమశాఖ అధికారులు పద్మమ్మ, ఆంజనేయులు బుధవారం వెల్లడించారు. ఇకపై వీరు పూర్తి స్థాయిలో పట్టుపరిశ్రమ పరిధిలోనే పనిచేస్తారన్నారు. గత కొన్నేళ్లుగా పట్టుపరిశ్రమలో రిక్రూట్‌మెంట్లు ఆగిపోవడంతో సిబ్బంది సంఖ్య తగ్గుతూ వస్తున్న నేపథ్యంలో వీఎస్‌ఏలకు పదోన్నతి కల్పించడంపై ఆ శాఖ వర్గాలను హర్షం వ్యక్తమైంది. పదోన్నతి పొందిన వారు ఒకట్రెండు రోజుల్లో ఎంపీడీఓ, అగ్రికల్చర్ ఆఫీసర్ల నుంచి నోడ్యూ సర్టిఫికెట్లు పొందిన తర్వాత పట్టుశాఖ ఏడీలను కలిసి నూతన విధుల్లో చేరాల్సి ఉంటుంది.

కళింగరతో జాగ్రత్త

- రసాయనాలు వాడి ఎర్రగా ఆకర్షణీయంగా మార్చేస్తున్న దుస్థితి


ఆర్.శ్రీనివాసులు, జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి



మీ కోసం

అనంతపురం అగ్రికల్చర్: "మండు టెండ నుంచి ఉపశమనం పొందేందుకు ఎర్రగా కనిపిస్తూ నిగనిగలాడుతున్న కళింగర (పుచ్చకాయ), కర్బూజాలాంటివి తింటున్నారా? అయితే ముందు మీ ఆరోగ్యం గురించి కూడా కొంచెం ఆలోచించండి' అంటూ జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు (95812 75717) ప్రజలను హెచ్చరిస్తున్నారు. ఇటీవల కల్తీ, నాసిరకంతో పాటు విషపూరితమైన రసాయన మందులతో మాగబెట్టిన పండ్లు బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారన్నారు. ఇందులో కళింగర కూడా ఉందన్నారు. మరీ ముఖ్యంగా వేసవి దాహాన్ని తీర్చుకునేందుకు బహిరంగ మార్కెట్‌లో కుప్పలు కుప్పలుగా పోసి అమ్ముతున్న కళింగర కాయ సహజమైన రంగా లేదంటే కృత్రిమ రసాయనాలు కలిపిన పండా అనేది తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.

- పక్వానికి రాని కళింగరలను, ఎర్ర రంగు రాని వాటికి సిరంజీల ద్వారా కృత్రిమ రసాయనాలను ఎక్కిస్తున్నారు. రసాయనాలు ఎక్కించిన కాయ లోపలి భాగం మామూలు కన్నా మరీ ఎర్రగా ఉంటుందన్నారు. లేదంటే నిర్దిష్ట గడువు కంటే ముందుగానే మాగడం జరిగి ఉంటుందన్నారు. దీని వల్ల సహజంగా లభించే పోషకాలు అందక, అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుందన్నారు.
- సహజంగా పండిన కాయలో మృదువైన ఎరుపు లేదా గులాబీరంగు ఉంటుంది. అదే రసాయనాలు కలిపిన వాటిలో డార్క్ రెడ్, బ్లడ్ రెడ్ రంగులో ఉంటాయి. అంతేకాక ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తుంది. కళింగర కాయ కోసి ముక్కలు నీటిలో వేస్తే నీరు ఎరుపు రంగులోకి మారితే రసాయనాలు కలిపినట్లుగా నిర్ధారించుకోవచ్చు. అలాగే కాయ తిన్న తర్వాత చేతులకు ఎరుపు రంగు అంటి, అది తుడిచినా అలాగే ఉంటే రసాయనాలు కలిపినట్లు గుర్తించాలి. సహజంగా పండిన పుచ్చకాయ తీపిగా తేలికగా ఉంటుంది. కృత్రిమ రంగు వేసినది కొంచెం చేదు రుచి వస్తుంది.
- పుచ్చకాయ పైభాగం పచ్చగా ఉండాలి, మెరుస్తూ ఉండకూడదు. తక్కువ గ్రీన్ కలర్ ఉన్నదే మంచిదని గుర్తించాలి. కాయ నేలపై ఉండే భాగం పసుపు రంగులో ఉండాలి. అలాగే ఆకారంలో గుండ్రంగానూ, సమంగానూ ఉంటే మంచిది. ఎడమొడిగా ఉంటే బాగా లేదని అర్థం. కండ పట్టిన భాగం పచ్చగా ఉంటే ఇంకా పక్వానికి రాలేదని గుర్తు. పొడిగా, గోధుమ రంగులో ఉంటే పండిందని తెలుసుకోవాలి. కట్ చేసిన కాయ గాఢ ఎరుపు రంగులో ఉండకూడదు.
- రసాయనాలు కలిపిన పుచ్చకాయను తినడం వల్ల అలర్జీ, డయేరియా బారిన పడటమే కాకుండా దీర్ఘకాలంలో కాలేయం, కిడ్నీల సమస్య తలెత్తవచ్చు. క్యాన్సర్ రిస్క్ కూడా పెరుగుతుంది. ముఖ్యంగా చిన్నపిల్లలపై ఎక్కువ ప్రభావం ఉంటుంది.

తల్లి అంత్యక్రియలకు వెళితే..
ఇల్లు దోచేశారు


చోరీ ఘటనను వివరిస్తున్న బాధితురాలు హనీఫా

తాడిపత్రి: తల్లి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళ్లిన కుమార్తె ఇంటిని దుండగులు దోచేశారు. తాడిపత్రి మండలం బందార్లపల్లిలో ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన మేరకు... రెండు రోజుల క్రితం తాడిపత్రి మండలం వెంకటరెడ్డిపల్లి వద్ద ఆటో బోల్తా పడిన ఘటనలో తాడిపత్రిలోని భగత్‌సింగ్ నగర్‌కు చెందిన రసూల్‌బీ అనంతపురంలో చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రమాద విషయం తెలియగానే ఆమె కుమార్తె షేక్ హనీఫా ఇంటికి తాళం వేసి తన భర్తతో కలసి మంగళవారం రాత్రి అనంతపురంలోని సర్వజనాస్పత్రికి చేరుకుంది. బుధవారం తల్లి మృతదేహాన్ని తాడిపత్రికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. అనంతరం కుమార్తె హనీఫా తన స్వగ్రామం బందార్లపల్లికి చేరుకుంది. అప్పటికే ఇంటి తాళం పగులగొట్టి ఉండడం గమనించిన ఆమె ఆందోళనతో లోపలకు వెళ్లి పరిశీలించింది. బీరువాలోని బంగారు నెక్లెస్, లాంగ్ చైన్, కమ్మలు, కొంత నగదు చోరీకి గురైనట్లు గుర్తించి సమాచారం ఇవ్వడంతో తాడిపత్రి రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

22న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

అనంతపురం సిటీ: ఉభయ జిల్లాల జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 22న నిర్వహించనున్నారు. అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలోని ప్రధాన, అదనపు సమావేశ భవనాల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు సీఈఓ రాజోలి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ జి.వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఏర్పాట్లలో జెడ్పీ ఉద్యోగులు నిమగ్నమయ్యారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు స్థాయీ సంఘం-1, 2, 4, 7(ఆర్థిక, ప్రణాళిక/ఇంజినీరింగ్ విభాగాలు/గ్రామీణాభివృద్ధి/విద్య, వైద్యం) సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు. అదనపు సమావేశ భవన్‌లో స్థాయీ సంఘం-3, 5, 6(వ్యవసాయం/ఐసీడీఎస్/సాంఘిక సంక్షేమ శాఖలు) సమావేశాలు ఆయా చైర్‌పర్సన్‌ల అధ్యక్షతన డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య నేతృత్వంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆయా శాఖల అధికారులతో పాటు స్థాయీ సంఘ సభ్యులకు సమాచారం చేరవేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

SUMMER CAMP

- Spoken English, Grammar, Beautiful Handwriting, Maths, Physics, Chemistry # A.G. REDDY ACADEMY, Sai Nagar, 7th cross, ATP. 9000490141, 9019795268. [A-1544]

REAL ESTATE

TO-LET

- డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు, మంచినీరు పుష్కలం, బాడుగ Rs. 8000/- మాత్రమే. అనంతపురం టౌన్ నందు కళ్యాణదుర్గం రోడ్డుకు, Dr. రజాక్ హాస్పిటల్ వద్ద. Ph: 9951626131. [A-1543]

STAR REAL ESTATES

- అనంతపురం నుంచి కేవలం 7 కి.మీ. లోపలే ATP నుండి ధర్మవరం వెళ్ళే 100 అ॥ రోడ్డు దగ్గరలో సెంటు కేవలం ₹2,49,000 నుండి ప్రారంభం. మరిన్ని వివరాల కోసం సెల్: 9396205666, షేక్షావలి, స్టార్ రియల్ ఎస్టేట్స్, రాంనగర్ రిజిస్టర్ ఆఫీస్ ఎదురుగా, ATP. [A-1541]

WANTED

- KLD లో, ప్రముఖ ఎడ్యుకేషనల్ ఆఫీస్ కొరకు లేడీ టెలికాలర్స్ కావలెను. Q: ఇంటర్ / డిగ్రీ, ఆపైన. 6304109997, 9346781049, 8885533013 [A-1545]
- అనంతపురం పట్టణంలోని ప్రముఖ కళాశాలకు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ సబ్జెక్టుల సీనియర్ మరియు జూనియర్ లెక్చరర్లు, లేడీ మరియు జెంట్స్ వార్డెన్లు, కాలేజ్ లోనే ఉండే బాత్రూం కడిగే వాళ్ళు మరియు కసువు ఊడ్చే వాళ్ళు కావలెను. సెల్ : 8019545433, 8019787833, 9652390088. [A-1540]
- SOLAR ప్రొడక్ట్స్ మార్కెటింగ్ కొరకు అనుభవము గల సేల్స్ పర్సన్స్ కావలెను. # ప్రశాంతి నగర్, తపోవనం దగ్గర, అనంతపురం. 9160353879. [SCA25002195]
- Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25,000 నుండి 30,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95504 67459. [SCA 25002218]
- అనంతపురములో జాబ్ చేయుటకు 10th to PG అర్హత కలిగిన యువతీ యువకులకు ఆఫీస్, స్కూల్స్, కాలేజెస్, హాస్పిటల్, షాపింగ్ మాల్ మరియు ఇతర కంపెనీస్ నందు జాబ్స్ కలవు. సంప్ర॥ కమలానగర్, S.V. హాస్పిటల్ లైన్, ATP, సెల్: 8328522802. [SCA25002230]
- Wanted / Assistant Manager for Anantapur. Biggest Furniture Showroom "Mamatha Furniture". (Salary: 20,000 + Incentive. Requirements / Education: Degree / 2 yrs. Retail experience / Basic Computer Skills) Interview Date & Time : 20 & 21 March at 11-00 AM to 5-00 PM. Address: గుత్తి రోడ్డు, మార్కెట్ యార్డ్ ఎదురుగా, అనంతపురం. [A-1546]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.